
**“నిన్న, నేడు, రేపు అనే తేడాలకు నోచుకోకుండా మంచులా కాలం ఘనీభవించిన సందిగ్ధ సమయంలో జంతువూ, మనిషీ, లింగ బేధాలూ, దాంపత్యమూ, కులమూ, మతమూ, ప్రాంతమూ, దేశమూ అనే విభజనలనంతా కూలదోస్తే అస్తిత్వాల ఆరాటాల లోయలో తాత్త్వికతలనూ, ఆధ్యాత్మికతలనూ పట్టించుకోకుండా పర్వత శిఖరాల్లా స్థిరంగా నిలబడిన భౌతిక సత్వాల చెంతలో యెప్పటికప్పుడు మాసిపోతున్న విలువలు అలజడినీ, ఆశ్చర్యాన్నీ కలిగిస్తూనే వుంటాయి.”**

మధురాంతకం నరేంద్ర

# 5

# అమర్ కథ





‘‘యే కాంతంగా మాట్లాడుకోవాలని శివుడే ఆయన భార్య పార్వతిని ఆ గుహకు తోడ్కొని పోయినాడంట! అట్లాంటి తావుకు బయల్దేరిన భార్యాభర్తల్ని నువ్విప్పుడీ మాదిరిగా విడదీసి పంపించేది న్యాయం గాదు,’’ అని మొరాయించాడు అమర్.

గుడారంలోని గుడ్డి విద్యుద్దీపపు వెలుతురులో, ప్లాస్టిక్ నవారు మంచాలపైన రజాయిలు కప్పుకొని గుడ్డల మూటల్లా కనబడుతున్న యాత్రికులనంతా పరకాయించి చూశాక, ‘‘మొగుడూ పెండ్లాలు వొగిటిగా చెయ్యిచెయ్యి పట్టుకొని పోయేదానికిదేమీ పెండ్లి ఊరేగింపు గాదు. అమర్‌నాథ్ గుహ యీ బాల్టాల్ నించీ పధ్నాలుగు మైళ్లు కొండలపైన దోవ,’’ అంటూ విసుక్కున్నాడు టూరు కంట్రాక్టరు అణ్ణామలై రెడ్డి.

ఆ గుడారానికి చివర్లో కూచున్న లావుపాటి స్త్రీ, ‘‘రహస్యం చెప్పేదానికని పరమేశ్వరుడు ఆ కొండల్లో వుండే గుహకు పెండ్లాన్ని తోడ్కొని పోయినప్పుడు, ముందుగా వొకచోట నందినీ, యింకో తావులో వినాయకుడ్నీ, యింకో జాగాలో పాముల్ని యిడిసిపెట్టేసి యెలబారిపోయినాడంటగదా! మా సిమ్ము కార్డులు యీ జెమ్మూ కాశ్మీరాల్లో పనిజెయ్యకపోవడంతో మా సెలుఫోనుల్ని జమ్మూలోనే యిడిసిపెట్టుకున్నాము. మా సూటుకేసుల్ని బాల్టాల్‌లో బస్టాండ్‌లో ఆగిపోయిన బస్సుల్లో వదులుకున్నాము. ఆ గుహకు పోవాలంటే యింకా యేమేమి వదులుకోవాల్నో?’’ అని నిట్టూరుస్తూ చేతులు జోడించి కళ్లు మూసుకుంది.

ఆవిడకేసి విస్తుపోయి చూసి, అంతలో తేరుకుని, ‘‘పెద్దగా చదువుకోకపోయినా మహాలక్ష్మమ్మే అందరికంటే తెలివిగా వుండాది జూడండి...’’ అని మెచ్చుకున్నాడు అణామలై రెడ్డి.

‘‘టూరుకు తోడుకోనొచ్చిన నలభైమందినీ వొకే గుంపుగా పల్లకీలో అంపించేది కుదిరే పని కాదు. పల్లకీలను మోసేది మిషన్లు గాదు, మనుషులు. పల్లకీల్లో మోయాల్సిన మనిషి బరువును బట్టి స్పీడుంటాది. యీ పల్కీ కాంట్రాక్టరు ముజాహీద్ సాబ్‌తో నాకు పదేండ్లుగా సావాసం. లెక్క తప్పకుండా గిరిగీసినట్టుగా పనిచేస్తాడనే

బేరం జేసినాడను. ఆయన దగ్గరయితే దేనికి దగిన మనుషులు దానికుండారు. అమర్‌నాథ్ సార్ భార్య సన్నంగా రెపరెపా వుండాదని ముందుగా వచ్చిన పల్కేవాళ్లు జవురుకునేసినారు. యీ మహాలక్ష్మమ్మ మాంతమైన బరువుండాదని యెవరూ ముగపటంలేదు. యీమెను మోసుకొని పోవాలంటే ఆరుమందైనా గావాల్ల... గుర్రాల్నీ గాడిదల్నీ ఒకేగాట్లో కట్టేదానికి కుదరదు...'' మాట జారినట్టుగా తోచగానే అణ్ణామలై రెడ్డి నాలుక్కరచుకున్నాడు.

అంతవరకూ భార్గవి కూచున్న మంచం పక్కనే నిల్చున్న గడ్డం పాల్కీవాలా, ''అబ్ తుమ్ ఆవో మాజీ...'' అంటూ ఆవిడ చేయి పట్టుకుని పైకిలేపి, సరసరా గుడారం బయటికి లాక్కెళ్లిపోయాడు.

అణ్ణామలైరెడ్డి మరోసారి కిసుక్కుమని నవ్వేసి, ''సారు బయపడేటంతగా మేడం బయపడతా వుండాదా జూడండి? దైర్నంగా యెలబారేసింది. మొగోళ్లతో సమానంగా వుద్యోగం చేస్తా వుండే మనిషి. పద్నాలుగు లోకాలు జయించుకొనొస్తాది...'' అని సరాయించాడు. .

''నా వైపు వొంటిగా గడప దాటలేదెప్పుడూ... ఆఫీసుకు కూడా నేనే స్కూటర్లో తొడుక్కోనిపోవాల... నేను అవుటాఫ్ స్టేషనయితే లీవయినా పెట్టేస్తిందిగానీ ఆటో యెక్కదు...'' అని వాపోతూ అమర్ గుడారం బయటికి పరిగెత్తాడు.

కొన్ని చుక్కల్ని మాత్రమే మిగుల్చుకున్న నల్లటి ఆకాశం కింద బాల్టాల్ లోయ చలిలో ముడుచుకుపోతోంది. వుండీ వుండీ పడుతున్న చినుకులతో నేలంతా చిత్తడి చిత్తడిగా రొజుతోంది. లోయలో కుప్పబోసినట్టున్న విద్యుద్దీపాల మధ్యలో, తాత్కాలికంగా వేసిన గుడారాలు వణకుతున్న ముసలివాళ్లలా కనబడుతున్నాయి.

గుడారాల మధ్య దీనంగా సాగుతున్న మట్టిబాట పైన బూట్లు తపతపమని బురదను యెగొడుతూండగా అటూ యిటూ పరిగెత్తి, ప్రయాణానికి సిద్ధంగా వున్న పల్లకీల చుట్టూ పిచ్చిపట్టిన వాడిలా ప్రదక్షిణాలు చేసి, నిస్సహాయంగా మళ్లీ తన గుడారంలోకే తిరిగొచ్చాడు అమర్.

''యీ రవంతసేపట్లోనే వాళ్లు నా వైఫు నేవైపుకు లాక్కుపోయారో తెలియనే లేదు...'' అని వణకుతున్న గొంతుతో వాపోతూ మంచంపైన సోలిపోయాడు.

''యీ ప్రయాణంలో నా భార్యకు కొన్ని విషయాలు చెప్పాలని కాపెట్టుకోనుండాను నేను,'' అన్నాడో యాత్రికుడు. చిత్తశుద్ధిగా అంటున్నాడో, యెగతాళీగా అంటున్నాడో అర్థంగాని ధోరణిలో.

అవునన్నట్టుగా తల వూపాడు అమర్. వెంటనే 'ప్రతిభ' లేకపోయుంటే తానేమైపోయి వుండేవాణ్ణన్న సంగతి స్ఫురించింది. యీ ప్రయాణంలో యెలాగైనా ఆ విషయాన్ని తన భార్యకు చెప్పి నచ్చజెప్పాలనుకున్నానన్న సంగతి గుర్తుకొచ్చింది.

యింతలో మోకాళ్ల కిందవరకు వేలాడే పైలాన్ (పొడవాటి చొక్కా) తొడుకున్న గడ్డం యువకుడొకడు గుడారంలోకొచ్చి, అమర్ మెడలో వేలాడుతున్న గుర్తింపు కార్డునోసారి తిప్పి చూసి, "ఆవో సాబ్... అబ్ తుమ్ హమారా హోగయా!" అని పిలిచాడు.

"అదీ లెక్కంటే! నిన్న రాత్రొచ్చి, మనుషుల్ని సెలెక్టు జేసుకొని వాళ్ల ఐడెంటీ కార్డులు తగిలించేసిపోయినోళ్లు... యిప్పుడెంత సరిగ్గా గుర్తుపెట్టుకొని తోడ్కొనిపోతా వుండారో జూడండి..." అని మెచ్చుకున్నాడు అణ్ణామలై రెడ్డి.

బురదలో బూట్లు జారుతున్నా పట్టించుకోకుండా, అమర్‌ను బాటలోకి లాక్కొచ్చి, నేలపైన లేచి చూస్తున్న వో పల్లకీలో కుదేశాడు పైలాన్‌వాలా. బురదతో బరువెక్కిన బూట్లను ఒకదానితో మరొకదాన్ని రుద్దుకుని శుభ్రం చేసుకోడానికి ప్రయత్నిస్తూ, వీపు పైన వేలాడుతున్న సంచిని గట్టిగా పట్టుకున్నాడు అమర్. రెండు వైపులా పొడవాటి వెదుర్లు కట్టిన ప్లాస్టిక్ నవార్లయిన ఇనుపకుర్చీని గట్టిగా పట్టుకుంటూ, "యిస్కో పల్లకీ కౌన్ కెహేంగే? యే అంపశయ్యా హైనా?" అంటూ తనకు తెలిసిన సగం సగం హిందీలో మొత్తుకున్నాడు.

ఫిరాన్ గడ్డంవాలా అతని మెడలోని ఐడెంటిటీ కార్డు లాక్కుని, అలాంటిదే మరొకటి తగిలించి, "యే తుమ్‌కో చెకింగ్‌కే బాద్ ఫిర్ మిలేగా," అన్నాడు.

తన కాశ్మీర్ శాలువాను కుర్చీపైన పరుచుకున్నాడు అమర్. తన భార్య చుట్టూ వున్న పల్లకీల్లో కనబడుతుందేమోనన్న ఆశతో కళ్లు చిట్లించుకుని చూశాడు.

దూరంగా వున్న పర్వతాలు చీకట్లో కలిసిపోవడంతో బాల్టాల్ లోయ యింకా బూడిద మిగిలిన పెనంలా ఉంది. బూడిదలో మిగిలిన నిప్పురవ్వల్లా గుడారాల చుట్టూ గుడ్డిదీపాలు జోగుతున్నాయి. దూరంగా అంగళ్ల దగ్గరి నుంచి సంరంభం వినబడుతోంది. భోజనాల భండారాలు రంగు దీపాల్ని తగిలించుకుని జాగారం చేస్తున్నాయి.

పల్కీవాలాలు నలుగురు నాలుగు వైపులకు చేరి, 'భంభం భోలే,' అని అరుస్తూ పల్లకీని భుజాలపైకెత్తుకున్నారు. అమర్ కుర్చీ చేతులు గట్టిగా పట్టుకున్నాడు. బాటపైన గుర్రాలూ, పల్లకీలూ గుంపులు గుంపులుగా కదులుతున్నాయి. పల్కీ వాలాల బూట్లూ, గుర్రాల గిట్టలూ పెద్దగా సవ్వడి చేస్తున్నాయి. పాదచారులు కర్రల వూతంతో నడుస్తూ 'భంభం' అని గొంతు చించుకుంటున్నారు. అక్కడక్కడా వెదురు కర్రలకు వేలాడుతున్న విద్యుద్దీపాల సాయంతో బాటను కనిపెట్టుకుంటూ పల్లకీలు బయల్దేరాయి.

చీకటి దారీ, అపరిచితుల రొదా తన ఒంటరితనాన్ని రెట్టింపు చేస్తూండగా "చెకింగ్ కితనా దూర్ హై?" అని అడిగాడు అమర్.

"దో కిలో మీటర్..." పల్కీవాలాల్లో ఒకరెవరో సమాధానం చెప్పాడు. దారి మలుపు తిరిగినప్పుడల్లా పల్కీవాలాలు ఎదురుకర్రల్ని భుజాలు మార్చుకోవడంతో

పల్లకీ అటూ ఇటూ వొరిగిపోతూనే వుంది. దీపాలు వెలుగుతున్న చోట పైకి ముల్లుల్లా పొడుచుకొచ్చిన రాళ్లతో బాట బయపెడుతోంది.

రాళ్లమధ్య పల్కీవాలాలు బూట్లు జారుతుండగా, "పూరా రస్తా యిసీహీ హోతాక్యా?" అని కంగారుగా అడిగాడు అమర్.

"యే రస్తా అచ్ఛాహైనా! బాద్‌మే పహాడోంపే చడనా!" అన్నాడో పల్కీవాలా.

నల్లటి గుడ్డకు కుట్టిన గుండీల్లా దారిదీపాలు మిటకరిస్తున్నాయి. కాలాన్ని బలవంతంగా ముందుకు తోస్తున్నట్టుగా పల్కీవాలాలూ, గోడావాలాలూ రొప్పు తున్నారు. ఆ చీకటిబాటలో భార్య పల్లకీ కూడా ప్రయాణం చేస్తోందని గుర్తుకొచ్చి నప్పుడల్లా అమర్ వులిక్కిపడసాగాడు. భవానీ-ప్రతిభ అనే రెండు మాటలు తనను వెంటాడుతున్నట్లుగా తోచడంతో బెంబేలు పడసాగాడు. రెండు కిలోమీటర్లనే దూరం రెండు యుగాలైనా గడిచినట్టుగా లేదు.

వున్నట్టుండి దూరంగా చీపురుతో చిమ్మి తోసేసిన గుండీల్లా విద్యుద్దీపాలన్నీ గుమికూడినచోట ప్రత్యక్షం కాగానే బాట మలుపు తిరిగి వుంటుందని అనుకున్నా డతను. దీపాలగుంపు చెకింగ్ షెడ్డుగానూ, కొయ్య బారికేడ్ల మధ్య కదులుతున్న నీడలు యాత్రికులుగానూ నెమ్మదిగా తెలిసివచ్చింది. షెడ్డు దగ్గర పల్లకీని దింపాక, "యే మర్దోంకా చెకింగ్ పాయింట్," అన్నాడో పల్కీవాలా. దూరంగా స్త్రీలగుంపున్న షెడ్ కేసి ఆత్రుతతో కలయజూశాడు అమర్.

బారికేడ్ల మధ్య నిల్చున్న యాత్రికులు తుపాకులు పట్టుకున్న సిపాయిలను చూసి వెనకడుగు వేస్తున్నారు. రేకుల షెడ్డు కింద రకరకాల భాషలు కలగలిసిన వింత శబ్దాలు చెలరేగుతున్నాయి. అటువైపు కూతల గేటు దగ్గర కుర్చీలు వెదురు కర్రలు విడివిడిగా పట్టుకున్న పల్కీవాలాలూ, గుర్రాలూ, గోడావాలాలూ కిక్కిరిసిపోయి తోసుకులాడుతున్నారు. వాళ్ల ధాటిని తట్టుకోలేక డబ్బారేకుల ప్రహరీ గోడ డబడబ లాడుతోంది.

ప్రహరీ కవతల నక్కిన చీకటి గుబులు పుట్టిస్తోంది. గేట్ల ముందున్న మెటల్ డిటెక్టర్ ద్వారాలు దర్పంగా చూస్తున్నాయి. తన చుట్టూ వున్న యాత్రికుల మాటల్లో తనకు కావల్సిన సమాధానాల కోసం అమర్ చెవులు రెట్టించాడు..

క్షణాల్ని నిముషాలుగా సాగదీశాక, ప్రహరీ కవతల బూట్ల సవ్వడి పెద్దగా విన వచ్చింది. యాత్రికులందరూ బ్యాంకుల నుంచి తెచ్చుకున్న అనుమతి పత్రాలు చేతుల్లోకి తీసి పట్టుకోసాగారు. 'టైం చార్ బజ్‌గయా!' అని అరుస్తున్నారెవరో... క్యూ లోని జనం ముందుకు కదలడంతో చెకింగ్ మొదలైనట్టుగా తెలుస్తోంది.

పల్కీవాలాల గేటుదగ్గర పెద్దగా కల్లోలం చెలరేగసాగింది. మనుషులూ, కర్రలూ, కుర్చీలూ, గుర్రాలూ కలగాపులగంగా కలిసిపోయిన గుంపొకటి వుప్పెనలా

ముందుకురుకుతోంది. వాళ్ల ముందున్న రేకుల గోడ వెనుక్కు వొంగిపోతోంది. గోడ పైన్నుంచీ జనప్రవాహం ముందుకు తోసుకెల్తోంది. ఆడవాళ్ల షెడ్డు దగ్గర అలజడి పెద్దగా కనబడకపోవడంతో అమర్ వూరటపడ్డాడు.

క్యూలో ముందుకు కదులుతుండగా అనుమతి పత్రంలో తనకిచ్చిన తారీఖు యివ్వాల్టిది గాదన్న సంగతి గుర్తుకొచ్చిందతడికి. వెనకున్న వాళ్లు తోయడంతో చెకింగ్ సిపాయిల ముందుకు విసురుకుపడ్డాడు. అతడి చేతిలోని అనుమతిపత్రాన్ని లాక్కున్నాడో సిపాయి. మరోసారి వెనకవాళ్లు తోయగానే గేటుకివతలకొచ్చి పడ్డాడు.

ప్రహరీ కవతల పొదుపుగా వెలుగుతున్న విద్యుద్దీపాల వెలుతురులో జనాలు గింగిరాలు తిరుగుతున్నారు. పల్కీ కుర్చీలూ, కర్రలూ, గుర్రాలూ జనాల మధ్యలోంచి దూరుతున్నాయి. యెటువెళ్లాలో తోచక రాయిలా నిలబడిపోయిన అమర్ దగ్గరికో ఫిరాన్ గడ్డంవాలా వచ్చి, ''హమ్ వహాఁహై సాబ్.. ఆవో,'' అని చేయి పట్టుకుని ముందుకు లాక్కెళ్లసాగాడు.

బురదలో జారుతున్న అడుగుల్ని తమాయించుకుంటూ శాలువానూ, సంచిని గట్టిగా పట్టుకుని, తన ప్రమేయం లేకుండా, అమర్ అతడి వెంట విసురుకుపోసాగాడు. బాటపైన గుర్రాలొకమంద నిలబడి సకిలిస్తున్నాయి. ఫిరాన్ గడ్డంవాలాలు నీడల్లా కదులుతున్నారు. అక్కడక్కడా పల్కీ కుర్చీలు బురదలో కూరుకుపోయి వున్నాయి.

గుర్రాలూ, మనుషులూ, పల్లకీల మధ్యలో స్కేటింగ్ చేస్తున్నట్టుగా పల్కీవాలా లాక్కెళ్లినట్టల్లా పరిగెత్తిన అమర్ రొప్పసాగాడు. చివరికో పల్కీ దగ్గర ఆగిన పల్కీవాలా, ''అబ్ బైట్,'' అని ఆజ్ఞాపించాడు. కుర్చీలో తెగిన ప్లాస్టిక్ నవార్లను చూశాక అది తన పల్లకీనన్న నమ్మకం కుదిరింది. చీకట్లోంచి పుట్టుకొచ్చినట్టున్న పల్కీవాలా ఒకడు అతడి మెడలోని ఐడెంటిటీ కార్డు హారాన్ని లాక్కుని మరోదాన్ని తగిలించాడు. తరువాత అతగాడు చీకట్లో కలిసిపోయాడు. మరో ముగ్గురు పల్కీవాలాలు ప్రత్యక్షమయ్యాక నాల్గో పల్కీవాలా, ''అబ్ వుఠో,'' అని అరిచాడు. పల్లకీ పైకి లేచింది. అమర్ కుర్చీ చేతుల్ని గట్టిగా పట్టుకుని వెనక్కు వాలాడు.

దారిలో దూరదూరంగా వెలుగుతున్న గుడ్డి విద్యుద్దీపాలు బాట పర్వతపు వాలుపైన సాగుతోందని మాత్రం తెలుపుతున్నాయి. చీకటి పర్వతాలు యెత్తునుగానీ, లోయల లోతునుగానీ తెలియనివ్వడం లేదు. లోయ లోపలెక్కడో నీళ్లు పారుతున్న సవ్వడి మంద్రంగా వినబడుతోంది. ముందుకెళ్తున్న పల్లకీని అనుసరించడం ద్వారానే వెనకున్న పల్లకీలు దారిని కనిపెట్టుకుంటున్నాయి. యాత్రికులనెక్కించుకున్న గుర్రాల కళ్లాలు పట్టుకుని బాట గట్టుపైన పరుగులు తీస్తున్న గోడావాలాలు, ''పల్కీవాల, రస్తాదే,'' అని అరుస్తున్నారు.

పల్కీని వెనక మోస్తున్న పల్కీవాలా అమర్ భుజం పట్టుకుని ముందుకు తోస్తూ, "ఆగే మోడ్ కో బైటో సాబ్," అని విసుక్కున్నాడు. అమర్ ముందుకు వంగడానికి ప్రయత్నిస్తుండగా, ముందున్న పల్కీవాలా అతడి కాళ్లను కుర్చీ కింద కమ్మీపై తోసి, శరీరాన్ని వెనక్కులాగి, "అయిసా బైట్..." అని దబాయించాడు.

పల్లకీ బరువుగా కదులుతున్నప్పుడు బాట పర్వతం పైకి పాకుతోందనీ, గబగబా పరుగులు తీస్తున్నప్పుడు తగ్గులోకి దిగుతోందని అర్థమవుతోంది. కొండ చరియల వైపున నడుస్తున్న పాదచారులు, చేతికర్రల్ని నేలమోపుతూ, అలసిన గొంతులతో 'భంభం భోలే!' అని యెలుగెత్తి పిలుస్తున్నారు.

కాలాన్ని బలవంతంగా చించుతున్నట్టుగా దారి ముందుకెళ్తోంది. ముందుకూ వెనక్కూ కదలకుండా కూచోవలసి రావడంతో అమర్ ఇబ్బంది పడసాగాడు. యిలాంటి పల్లకీలో తన భార్య ఎంత ఇబ్బంది పడుతుందోనని బెంబేలు పడసాగాడు. ప్రతిభ దగ్గరుంటే తానింత కంగారుపడేవాడ్ని గాదని వాపోసాగాడు. మోస్తున్న పల్కీవాలాల కంటే తానే ఎక్కువగా రొప్పుతూ, యింతకంటే నడవడమే సుఖంగా వుండేదేమోనని తిట్టుకోసాగాడు. చలిగాలి వీస్తున్నా అతడు చెమటలు కక్కసాగాడు. క్షణాలు దొర్లడం కంటే తన గుండే ఎక్కువగా కొట్టుకుంటున్నట్టుగా తోచసాగిందతడికి.

పలచటి తెర యేదో తొలగినట్టుగా చుట్టూ పర్వతాలూ, కిందుగా లోయలూ స్పష్టాస్పష్టంగా కనబడసాగాయి. పర్వతపు అంచుపైన సాగుతున్న యాత్రికుల వరస కాంతి పెరిగేకొద్దీ పొడుగ్గా సాగసాగింది. చీకటి పలచబడేకొద్దీ కొసల్ని చూడనివ్వనంతగా పెరిగిన పర్వతాలూ, లోతుల్ని దాచుకున్న లోయలూ అతడ్ని కవ్వించసాగాయి. సన్నటి బాట పైన సాగుతున్న యాత్రికులు దూరం నుంచీ చీమలబారులా కనిపిస్తున్నారు. సుదూరంగా పర్వతపు మలుపు దగ్గర బాట కూడా మలుపు తిరిగి మాయమైపోతోంది.

అక్కడక్కడా కుచ్చులా పెరుగుతున్న వృక్షాలు తప్ప మిగిలినదంతా బోడిగా వున్న పర్వతాలు ఆదిమ మానవుల తలల్లా చిత్రంగా కనబడుతున్నాయి. గట్టు పైన శిఖరాలపై నుంచి జారుతున్న మట్టి పొరల్ని సరకు చేయకుండా అక్కడక్కడా బండరాళ్లు నిలబడిపోయి వున్నాయి.

పర్వతాల వాలునానుకుని పాకుతున్న మట్టిబాట లోయవైపుకు వాలుతూ కిందున్న లోయను వూరిస్తోంది. బాట చివరలో పరిగెత్తుతున్న గుర్రాల నాలుగో కాలు లోయలోనే పడుతున్నట్టు కనబడడంతో అమర్ బెంబేలెత్తిపోసాగాడు. వాటితోబాటూ పరిగెత్తుతున్న గోడావాలాలు కూడా లోయలోకే జారుతున్నట్టుగా కనబడుతున్నారు. కొండవాలుకు బల్లుల్లా అతుక్కుని పాకుతున్న పాదచారులు లోయవైపుకు భయంగా చూస్తున్నారు. దూరంగా పర్వతాలు రెండూ మలుపు తిరిగిన చోట ఆకాశపు పేలిక తొంగిచూస్తోంది.

లోయ భయపెట్టడంతో అమర్ తన చూపుల్ని పర్వతపుసోలుకేసి తిప్పు కున్నాడు. పల్లకీని మోస్తున్న వ్యక్తుల వయస్సెంతో తెలియడంలేదు. ముందున్న వాళ్లిద్దరు పల్లకీ కర్రలకు అడ్డంగా కట్టిన కర్రను తల వెనుక భుజం పైన మోపుకుని నడుస్తున్నారు. బరువుతో వంగిన వాళ్ల తలలకు దారి కనబడడంలేదేమోనని అమర్ కంగారుపడసాగాడు. కుడివైపున పల్కీవాలా నల్లరంగు తలపాగా చుట్టుకుని వున్నాడు. అతడి పిలాన్ కిందున్నది పాంటో, పైజామానో తెలియడం లేదు. అతడు భుజాలపైన దళసరి రగ్గును మడిచి పెట్టుకుని దానిపైన వెదురు కర్రను మోపుకున్నాడు. అతడి యెడమచేయి యెడమవైపున్న పల్కీవాలా నడుమును చుట్టుకోగా, యెడమవైపున్న పల్కీవాలా తలకో పెద్ద శాలువా సగాన్ని చుట్టుకుని, మిగిలిన సగం శాలువానే భుజాల పైన చుట్టగా చుట్టి, దానిపైన వెదురు కర్రను మోపుకున్నాడు. వాళ్ల బవిరి గడ్డాలూ, తొడుక్కున్న బట్టలూ, బట్టల్లోంచి పొడుచుకొచ్చిన శరీరమూ, బూట్లూ అన్నీ మట్టి గొట్టుకుపోయి వున్నాయి.

బాట వున్నట్టుండి మలుపు తిరిగి లోతులోకి జారుతోంది. నేలలోంచి శూలాల్లా పొడుచుకొచ్చిన రాళ్ల మధ్య గుర్రాలు అదొక కేళిగా పరిగెత్తుతున్నాయి. ఒకరి నడుమునొకరు పట్టుకున్న పల్కీవాలాలు పెద్దగా క్రీంకారం చేస్తూ బాటలో దూకసాగారు. కుడివైపున్న పల్కీవాలా కుడికాలు లోయకొసలో పడుతోంది. యెడమ వైపున్న పల్కీవాలా అతడ్ని యివతలికి లాక్కుంటూ గెంతుతున్నాడు. కుడివైపున్న లోయ అగాధంలోకి కుంగుతోంది. యిదివరకూ చీకటిగా వున్నప్పుడు పల్కీవాలాలు ఇలాగే దూకినప్పుడు, యిలాంటి దిగుడుబాటలోనే పల్లకీ సాగివచ్చిందని స్ఫురించ గానే అమర్ భయంతో వణికిపోతూ కళ్లు మూసుకున్నాడు.

పల్లకీ నిటారుగా సర్దుకున్నాకగానీ అతడు కళ్లు తెరవలేదు. కొండవాలు పైన, పెద్దబండ పైన స్టెన్ గన్ పట్టుకున్న సిపాయి కనబడగానే అతడు వులిక్కిపడ్డాడు. మరికాస్త దూరం తర్వాత గట్టుపైన మరో సిపాయి కనిపించాడు. యింకాస్త దూరం వెళ్లాక, రాత్రంతా చీకటిలో యిలా దారి పొడవునా, బాట పక్కన సిపాయిలు గస్తీ తిరుగుతూనే వున్నారన్న విషయం అర్థమైపోయిందతడికి.

వెనక నుంచి, "పల్కీవాలా... రస్తాదే..." అన్న కేకలు వినిపించాయి. పెద్దగా గుర్రాల గిట్టల శబ్దమూ చేరువయ్యింది. పల్కీవాలాలు కొండవైపుకు వొంగి నిల బడ్డారు. రెండువైపులా గ్యాస్ సిలిండర్లూ, సరుకుల మూటలూ తగిలించుకున్న బక్క గుర్రాలు కొన్ని ఒకదాన్నొకటి తోసుకుంటూ పరిగెత్తసాగాయి. వాటి తర్వాత యాత్రికుల నెక్కించుకున్న గుర్రాల్ని తోలుకుంటూ గోడావాలాలు పరిగెత్తుతున్నారు. దాదాపొక పావుగంటసేపు పల్లకీలు నిలబడిపోయాయి. గుంపుగా, వరసలు వరసలుగా పరిగెత్తిన గుర్రాలను చూస్తూ అమర్ విస్తుపోసాగాడు.

చీకటిని పూర్తిగా తరిమేసిన ఉదయపు కాంతి పర్వతాలనంతా అల్లుకుపోయింది. చల్లగాలి తేపలు తేపలుగా వీస్తోంది. రాలిపోవడానికి సిద్ధంగా వున్న మట్టి రాసుల్లా ఓసారి, దేనికీ తలవంచని రాతిబండల్లా మరోసారి కనబడుతున్న పర్వతాలు తమ అసలు స్వభావమేమిటో కనిపెట్టుకోమని సవాలు చేస్తున్నాయి. లోయపైన అలిగి దూరంగా వెళ్లిపోయినట్టుగా పర్వత పాదాలు దగ్గర వృక్షాలు గుంపులు గుంపులుగా పెరుగుతున్నాయి. పర్వతాల పైన అక్కడక్కడా పెరిగిన గడ్డి కొండ వాలుకు అతుక్కున్న బాక్టీరియాలా కనబడుతోంది. శిఖరాలపైన అక్కడక్కడా పేరుకుపోయిన మంచు పర్వతాలను రకరకాలుగా అలంకరిస్తోంది. లోయలోపలి తెల్లటి రాళ్లలా పేరుకుపోయిన హిమపాతాలను అక్కడక్కడా పగల గొట్టుకొని నీటిజాలు పారుతోంది. ఎక్కడైనా, ఎప్పుడైనా కిందికి జారిపోడానికి సిద్దంగా కనబడుతున్న మట్టిబాట పర్వతానికి కట్టిన మొలతాడులా కనబడుతోంది. బాట పొడవునా యాత్రికులు చీమలబారులా కదులుతున్నారు.

లోయలోకి రెండో అడుగు వేయబోయిన పల్కీవాలాను తనవైపుకు లాక్కుంటున్న మరో పల్కీవాలా "సమల్కే సమల్కే..." అని హెచ్చరిస్తూ పెద్దగా నవ్వుతున్నాడు. బాట పైకి వరతెంచిన చిన్న యెండ తునక తూర్పేవైపుందని ప్రశ్నిస్తోంది.

ఓ పర్వతపు సొలువు దగ్గర యాత్రికులు గుంపుగా కనబడ్డారు. అక్కడికి చేరగానే పల్లకీని కిందికి దించి, అలసటతో రొప్పుతూ, "యహా నాస్తా కర్‌నా... హమ్కో పైసా దేవ్..." అని వో పల్కీవాలా చేయి చాపాడు. చుట్టూ పల్లకీల్లో కూర్చున్న యాత్రికులకేసి అమర్ దీనంగా చూశాడు.

పది బారల కవతల, చదును చేసిన చిన్న జాగాలో, రాళ్ల గోడలపైన పేర్చిన యినుపరేకుల మధ్యలోంచి, పొగ సుళ్లు తిరుగుతూ పైకి లేస్తోంది. కొట్టం ముందు రాళ్ల పిట్టగోడ పైన గొంతుకూచ్చున్న పల్కీవాలాలు రొట్టెలు తింటూ చాయ్ చప్పరిస్తున్నారు. గాలి బలంగా వీచినప్పుడల్లా, కొట్టం రేకులపైన బరువు కోసం పెట్టిన రాళ్లు యెగిరి పడుతూ శబ్దం చేస్తున్నాయి.

అమర్ జేబులోంచీ వంద కాగితం పైకి తీశాడు. "హమ్ చార్ అద్మీ హైనా! పేట్మే ఖానా నైతో పహాడోంపే కైసే చడేంగే?..." పల్కీవాలా కోప్పడ్డాడు.

అమర్ మరో నోటు అందించాడు. "హమ్ చార్ ఆద్మీ," అతను వురిమి చూశాడు.

"పదివేలు కిరాయిగట్టి..." అమర్ గొంతు బొంగురుపోయింది. చుట్టూ వున్న పల్కీవాలాలు బిరుసుగడ్డాలతో, చేవబారిన శరీరాలతో నిర్లక్ష్యంగా కనబడుతున్నారు. తనకక్కడ పలుకు తోడెవరూ లేరన్న సంగతి అతడికి స్పష్టంగా అర్థమైపోయింది..

''వో యాత్రీ వుస్ పల్కీవాలోంకో దో హజార్ దియా...'' పల్కీవాలా పెద్దగా చేతులు తిప్పుతూ కసిరాడు.

అమర్ మరో రెండు నోట్లు కలిపి, ''పైసా బసమే రఖ్దియా... షామ్మే దేతూం...'' అని ప్రాధేయపడ్డాడు. పల్కీవాలా దురుసుగా నోట్లు లాక్కుని కొట్టంలోకి దూరేశాడు.

కొట్టానికవతల ఓ పెద్ద బండరాయి పక్కనుంచి సిపాయొకరు యివతల కొస్తూ కనబడగానే అమర్‌కు ధైర్యం వచ్చింది. చుట్టూ సేదతీరిన పల్లకీల్లో స్త్రీలెవరైనా వున్నారేమోనని కలయజూశాడు. భార్గవి పర్సులో డబ్బులెప్పుడూ వుండవనీ, నాస్తా కోసం పల్కీవాలాలు దబాయిస్తే ఆమె బెంబేలుపడక తప్పదనీ గుర్తుకురాగానే కంగారు పడ్డాడు. తనవైపే నడచి వస్తున్న సిపాయిని చూసి, పైకి లేచి బింకంగా, ''గుడ్ మానింగ్,'' అన్నాడు.

సిపాయి తలవూపి, ''కర్ణాటకా?'' అని అడిగాడు..

అమర్ తలఅడ్డంగా వూపి, ''ఆంధ్రప్రదేశ్'' అంటూ, ముందుకు వంగి సిపాయి యూనిఫాంపై నున్న బ్యాడ్జిని చదివి, ''మెర్విన్ శామ్యూల్'' అన్నాడు.

''ఫ్రం కేరళ'' అని నవ్వుతూ అతను ముందుకెళ్లిపోయాడు.

కొట్టంలోంచి బయటకొచ్చిన పల్కీవాలా అతడి చేయిపట్టుకుని, ''నాస్తా ఖాలియా... అబ్ ఛాయ్ పిలావో...'' అన్నాడు. అమర్ యేడుపు ముఖం పెట్టగానే, ''తుమ్ బీ పీవో,'' అన్నాడు ప్రసన్నంగా. అమర్ జేబులోంచీ పైకీ తీసిన డబ్బుల్ని పల్కీవాలా వూడబెరుక్కుని కొట్టంలోకెళ్లిపోయాడు. తన భార్య వద్దన్నా వినకుండా బంగారు నగలు వేసుకుని వచ్చిందనీ, పల్కీవాలాలు ఆవిడను బెదిరిస్తారేమోననీ అనుకోగానే అతడి కళ్లు చెమ్మగిల్లాయి. మంకీ టోపీ, వూలు మఫ్లరూ, గ్లవుజులూ, స్వెట్టరూ, బూట్లూ తొడుక్కున్నా అతడు వణకడం మొదలుపెట్టాడు.

''చాయ్... పీవో,'' అంటూ పల్కీవాలా ప్లాస్టిక్ కప్పునందించాడు.

పొగలు గక్కుతున్న టీ రెండుగుక్కలు తాగాక అమర్ కాస్త తెప్పరిల్లాడు. ప్రతిభ అవసరాన్ని తన భార్యకు వెంటనే చెప్పాలని అనుకుంటూ పల్లకీ కుర్చీలో కూచున్నాడు.

పల్కీవాలా పక్కనే నేలపైన గొంతుక్కూచుని టీ చప్పరించసాగాడు. ''తుమరా నామ్ క్యాహై బాయ్...'' అని బింకంగా అడిగాడు అమర్.

''మహమ్మద్ అకాబ్... వో ఆగే వాలా హైనా వో షోయబ్ ఖాన్... పీచేవాలా సర్ఫరాజ్ హఫీజ్... అవుర్ వే ఖుర్రమ్ తన్వర్...''

''తుమార్ గావ్?'' ''బద్దామ్... వుసీకో సోనామార్గ్... సబ్ చోటో వూటా గావ్...''

''...దిన్‌కో కితనా కమాతే తుమ్...?''

''కాంట్రాక్ట్ సాబ్ కో కమీషన్ దేనా పడతా....'' అంటూ కొట్టం కవతల కూచుని చిలుం పడుతున్న సన్యాసి దగ్గరికెళ్లిపోయాడతను. కాస్సేపటీ తరువాత బీడీ కాల్చు

కుంటూ తిరిగొచ్చి, ''యిస్కో తీన్ రూపా మాంగా హై వో...'' అని ఫిర్యాదు చేస్తూ నవ్వాడు.

మిగిలిన ముగ్గురు పల్కీవాలాలు కొట్టంలోంచి బయటికొచ్చాక పల్లకీ మళ్లీ పైకి లేచింది. కొట్టం ముందు బురద రొచ్చు రొచ్చుగా వుంది. బూట్లు బురదను పైకెగగొడుతూండగా పల్కీవాలాలు బాట పైకొచ్చారు.

బాటకోసం నరికిన కొండవాలు గట్టుపైన పలచటి పంచె మాత్రం కట్టుకున్న సన్యాసొకడు కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు. అతడి ముందున్న పెద్ద ఫ్లెక్సీ బోర్డు బొమ్మలో శివుడు పొడవాటి గంజాయి గొట్టం పట్టుకుని పొగ పీలుస్తున్నాడు. బోర్డుకు కాస్త దూరంలో తుపాకీ పట్టుకున్న సిపాయి శిల్పంలా నిలబడివున్నాడు.

గోదావాలాల గుంపొకటి దుమ్మురేపుతూ పరిగెత్తింది. కుర్చీలా, దానికి కట్టిన కర్రల్లా, తాముగూడా పల్లకీలోని భాగాలైపోయినట్టుగా పల్లకీవాలాలు పరుగులు తీస్తున్నారు. కడుపునిండా నాస్టా తిన్నాక వాళ్లెలా పరిగెత్తగలుగుతున్నారని అమర్ ఆశ్చర్యపోయాడు. తినకుండా డబ్బులు మిగుల్చుకున్నారేమోనన్న సందేహం రాగానే ముఖం ముడుచుకున్నాడు.

పర్వతపు మలుపు వరకూ వెళ్లాక బాట వెనక్కు తిరిగి అదే పర్వతం పైకి పాకసాగింది. దూరంగా బాట పైన వెళ్తున్న మనుషులు పురుగుల్లా కనబడుతున్నారు. గుర్రాల మూడుకాళ్లు గట్టుపైన ఉన్నప్పుడు, నాలుగో కాలు లోయలో పడినా ప్రమాదం లేదని అమర్‌కు అర్థమైపోయింది. పల్కీవాలాలు నలుగురూ వొకే జంతువు నాలుగు కాళ్లుగా మారి పరిగెత్తుతున్నా ప్రమాదం జరగదని ధైర్యం కలుగుతోంది. గోదావాలాలకు భయపడి ముందుకు పరిగెత్తుతున్న గుర్రాలను చూసినప్పుడు, పల్కీవాలాలను భయపెట్టి ముందుకు తరుముతున్నదెవరన్న సందేహమూ కలిగింది. కాంట్రాక్టరు కమీషన్ పోగా, పల్కీవాలాలకు రోజుకెంత గిట్టుబాటవుతుందో లెక్కగట్ట సాగాడతను.

నెత్తిపైన బారెడు పొడవున్న జటాజూటాన్ని చుట్టుకొని, మూరెడు గోతం సంచిని వీపున వేలాడేసుకుని, బూట్లు తొడుక్కున్న సన్యాసొకడు దీక్షగా నడుస్తున్నాడు. బాట లోయలోకి జారుతోంది. గుర్రాల కాళ్లు మడతబడిపోతాయేమోనని కంగారుగా ఉంది. పల్కీవాలాలు కప్పల్లా కిందికి గెంతుతుంటే లోయలోకి జారిపోతారేమోనని కంగారుగా ఉంది.

పటపటా జల్లులు పడ్డాయి.

''బరస్... బరస్...'' పల్కీవాలాలూ, గోదావాలాలూ గొంతులు చించుకుంటూ పరిగెత్తసాగారు. దబదబమంటూ రెండు వైపుల వర్షం విసిరికొట్టింది. సంచిలోంచి ప్లాస్టిక్ వానకోటు తీసి తలపైన కప్పుకున్నాడు అమర్. పర్వతాలపైన్నుంచీ దొర్లుకొచ్చిన

నీళ్లు, బాటపైన పడి, అక్కడినుంచి లోయలోకి దూకసాగాయి. పల్లకీలూ, గుర్రాలూ తడుస్తూనే ముందుకు కదిలాయి,

పది నిముషాల తర్వాత చేత్తో లాగేసినట్టుగా వర్షం ఆగిపోయింది పల్లకీని నేల పైకీ దించుతూ, “కొలాకాళీమాకే పాస్ ఆగయా.... అబ్ తుమ్ పైదల్ సే ఆనా...” అన్నాడో పల్కీవాలా.

అమర్ అయోమయంగా చూశాడు.

“పల్కీమే చడ్‌నేసే కాళీ మాతాకో గుస్సా ఆతా! హమ్ వుస్ పార్‌మే రెహతే!... తుమ్ వుదర్ తక్ చల్‌కే ఆవో...” అంటూ అతను అక్కడ పల్కీలు దిగి నడుస్తున్న యాత్రికులను చూపెట్టాడు. దారిపక్కన తుపాకులు పట్టుకుని నిల్చున్న సిపాయిలకేసి దీనంగా చూస్తూ అమర్ పల్లకీ దిగాడు.

పర్వతంపైన్నుంచీ లోయలోకి దిగుతున్న బాట బండల పైన్నుంచే జారుతోంది. కొండచరియను గట్టిగా పట్టుకుని, జారుతున్న బూట్లను నిలదొక్కుకుంటూ అమర్ దిగసాగాడు. రెండడుగుల కంటే తక్కువ వెడల్పున్న బాటపక్కన లోయ ఆవులిస్తోంది. బాటపక్కన కట్టిన రెండు ఇనుప కమ్మల బారికేడ్లు హద్దుల్ని చూపడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. కొండపేటుకు బల్లిలా కరుచుకుని, మెల్లగా అడుగుతీసి అడుగేస్తూ ముందుకు కదిలాడు అమర్. పెద్దగా గస తన్నుకు రాసాగింది. ఊపిరి పీల్చడం కష్టమైపోసాగింది. పర్వతాలపైన ప్రాణవాయువు తగ్గిపోతుందన్న విషయం గుర్తుకొచ్చిందతడికి, మనుషుల కోసం గాకుండా మరెవరి కోసమో సృష్టించిన మరో ప్రపంచంలోకి వెళ్తున్నట్టుగా స్ఫురించింది. అతడి ఉన్ని బట్టలు చెమటతో తడిసిపోయాయి. పెద్దగా రొప్పుతూ, బలమంతా కాళ్లల్లోకి తెచ్చుకుని అడుగులు వేయసాగాడు.

రాళ్లు పొడవాటి జారుడు మెట్లుగా మారి అడుగుల్ని నిలనివ్వడం లేదు. అలసటతోనూ, భయంతోనూ వణుకుతూ పర్వతపు పేటును ఆనుకుని నిల్చున్నాడు అమర్. అక్కడ తనలాగే పేటుకు అతుక్కున్న యాత్రికులు తలలు పైకెత్తి, ‘జై మాతాదే...’ అని అరుస్తున్నారు. పర్వతపు కొమ్ముకొసపైన, బండల వరసల మధ్య, నలుపురంగు పులిమిన భాగంలో కాళిక ఆకారం స్పష్టాస్పష్టంగా కనబడుతోంది. దారి సన్నదై, ఇరుకై నడవడానికి కష్టంగా తయారవడంతో అక్కడ కాళిక వెలిసిందో, లేకపోతే అక్కడ కాళిక విగ్రహముండడంతో దారి అలా తయారయ్యిందో తెలియడం లేదు. భయమో, భక్తో తెలియని పరిస్థితిలో అమర్ రెండు చేతులూ పైకెత్తి జోడించాడు. మరో రెండు బారలు కొండపేటును పట్టుకుని పాకాడు. పర్వతపు మలుపులో పెద్ద జలపాతమొకటి ప్రత్యక్షమయింది. జలపాతం దగ్గరదారి కాస్త విశాలమైంది. కొందరు సన్యాసులు జలపాతంలో తలస్నానం చేస్తున్నారు. వర్షంలో తడిసిన బురద పలచనై

లోయలోకి దొర్లుతోంది. గట్టుపక్కనున్న కమ్ముల కంచెను పట్టుకుని, సర్కసు చేస్తున్నట్టుగా, అవతలికి చేరుకున్నారు అమర్.

అవతలి గట్టుపైన గుమికూడిన జనంలోంచి ముందుకొచ్చిన పల్కీవాలా "సాబ్... హమారా పల్కా వహా హై ఆవో..." అంటూ చేయి చాపారు. అతడి చేతినలాగే గట్టిగా పట్టుకున్నాడు అమర్. పల్కీవాలా అతడినలాగే లాక్కుంటూ వెళ్లి పల్లకీకుర్చీలో కుదేశాడు. అలసటతో యెదరొమ్ము యెగసిపడుతుండగా కుర్చీలో సోలిపోయాడు అమర్.

గసలు కాస్త తగ్గాక మెల్లగా కళ్లు తెరిచాడతను. అందుకోసమే యెదురు చూస్తున్నట్లున్న పల్కీవాలా, దూరంగా ఉన్న నూనె కాగితపు గూడారాన్ని చూపెడుతూ, "వహా చాయి పిలావో సాబ్," అన్నాడు. అమర్ రెండు నోట్లు తీసిచ్చాడు..! "వహా కానేకోబీ మిలతా!" అన్నాడతను. అమర్ మరో రెండు నోట్లిచ్చాడు.

పర్వతపు వాలు పైన రాక్షసుల ఆయుధాల్లా ముందుకు పొడుచుకొచ్చిన గండశిలలు బాటపైకి దొర్లకుండా ఎలా నిలబడ్డాయో అర్థంగావడం లేదు. వాలు పైన రెండు చెట్లు ముందుకు వంగి, తర్వాత పైకిలేచి, నిటారుగా పెరుగుతున్నాయి. వేళ్లతో బాటూ పెకలించుకుని వాలుపైన పడిన చెట్టొకటి యెప్పుడైనా జారడానికి సిద్ధంగా ఉంది. పర్వత శిఖరంపైన అతుక్కున్న మంచుదిమ్మెలు కిరీటానికి వేలాడే ముత్యాల్లా మెరుస్తున్నాయి.

రెండోసారి పలహారం ముగించాక పల్కీవాలాలు బయల్దేరారు. వాళ్లు నడచి వచ్చిన దూరంతో పోలిస్తే తాను నడచిన దూరం లెక్కలోకి రాదు. కానీ వాళ్లెలా అలసిపోకుండా పల్లకీని మోస్తూ నడుస్తున్నారో అమర్‌కు అర్థంకాలేదు. పల్కీవాలాల పైన అమర్‌కు భయంతోబాటు గౌరవమూ ముంచుకొస్తోంది. వాళ్లకింకో రెండునోట్లు ఎక్కువిచ్చినా తప్పేమీలేదని అనిపించసాగింది.

పల్లకీ లోయలోకి గెంతుతుంటే పడిపోతానేమోనన్న భయంతో కుర్చీని గట్టిగా పట్టుకున్నాడు అమర్. వర్షంలో తడిసిన పర్వతాలు కడిగి పెట్టినట్టుగా శుభ్రంగా ఉన్నాయి. పైన తొంగిచూస్తున్న ఆకాశంలో ఎండ పలచగా పరుచుకుంటోంది. రెండు పర్వతాల మధ్య ఇరుక్కున్న మైదానంలో హిమపాతాలు అల్లిబిల్లిగా పాకుతున్నాయి. వాటిని పగలగొట్టుకుని కొన్ని సెలయేళ్లు పారుతున్నాయి.

మోస్తున్న పల్కీవాలాల కంటే తానే ఎక్కువగా రొప్పుతున్నానని అమర్‌కు స్ఫురించింది. నడుస్తున్నప్పుడు పల్కీలో వెళ్లడం సుఖమనీ, పల్కీలో ఉన్నపుడు నడవడమే సులభమని అనుకుంటున్నాననీ తెలిసి వచ్చింది. లోయ అంచుపైన పరిగెత్తుతున్న గుర్రాలను చూసినప్పుడు తెలివిగా పల్కీని యెంచుకున్నందుకు తనను తాను మెచ్చుకోసాగాడు. ప్రపంచమంతా పర్వతాల సందుల్లో ఇరుక్కున్నట్టూ, వాటి

కవతల మరేమీ లేనట్టు అయోమయంగా ఉంది. మంచుపర్వతాల దగ్గర కాలం గూడా గడ్డగట్టుకు పోయినట్టుంది.

పర్వతపు వాలులో, చిన్న గుట్టపైన హెలికాప్టర్ ఒకటి దిగుతోంది. దాని ముందు వందల వేల గుర్రాలతో జాతరేదో చెలరేగుతోంది. అక్కడి నుంచి బాట ఒకటి లోయల మలుపుకేసి పాకుతోంది. బాటపైన వరసగా గుర్రాలు యుద్ధానికెళు తున్నట్టుగా నడుస్తున్నాయి.

పర్వతపు మలుపు తిరగ్గానే పెద్ద మంచు మైదానంలోని రంగురంగుల గుడారాలు కనిపించాయి. మరికాస్సేపు గడిచాక అవతలి ప్రపంచానికి సరిహద్దులా పెద్ద పర్వతమూ, దానిలో పెద్ద గుహా ప్రత్యక్షమయ్యాయి.

బాట మంచుదిబ్బలపైకి మళ్లింది. సిపాయిలు పారలతో మంచుకోసి పక్కకు పోస్తున్నారు. రెండువైపులా నడుమెత్తున్న మంచుదిబ్బల మధ్య, లోయపైన గీసిన వాతలా బాట ముందుకెళ్తోంది. రెండువైపులా ఉన్న మంచుదిబ్బల యెత్తు సాగుతున్న కొద్దీ తగ్గిపోతూ రావడంతో, చివరకు బాట మంచులో కలిసిపోయింది. మనుషులూ, గుర్రాలూ నడచిన చోటల్లా పాడిపాడిగా తయారైన మంచుదిమ్మెల పైన పల్కీవాలాలు జారుతున్న పాదాల్ని నిగ్రహించుకుంటూ నడవసాగారు. దూరంగా ఆకాశమంత యెత్తున్న పర్వతమూ, దాని నోరులా తెరుచుకున్న గుహా, గుహ నిండుగా గుడారాలూ, గుడారాల చుట్టూ మనుషులూ, గుర్రాలూ- నిజానికీ వూహకూ మధ్య ఉండే సరి హద్దుల్ని చెరిపేస్తున్నట్టున్న దృశ్యమొకటి మోహరించి చూస్తోంది.

పర్వతం దగ్గరి మంచు మైదానంలో గుర్రాలు నెమరేసుకుంటున్నాయి. పల్కీ వాలాలు గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. గుర్రాల సకి లింపులూ, మనుషుల కేకలూ కలగలిసి అక్కడో శబ్దాల మేళా తయారయి ఉంది. గుడారాల ముందు కొందరు రంగురాళ్లు, చెట్ల బెరళ్లూ, వేళ్లూ అమ్ముతున్నారు. కొన్ని గుడారాల ముందు వేడినీళ్ల బాయిలర్లు పొగలు గక్కుతున్నాయి. భండారాల్లోని భోజన పదార్థాలు నోళ్లూరిస్తున్నాయి. యాత్రికులూ, సన్యాసులూ, వ్యాపారులూ, పల్కీ వాలాలూ, గోదావాలాలూ కలగలసిపోయి యెవరు యెవరో తెలియడం లేదు.

అప్పటికే నేలకు దిగిన పల్లకీల దగ్గర తమ పల్లకీని కూడా దించి, ''యహా సే పైదల్ జానా... ఆవ్ మేరీసాత్,'' అన్నాడో పల్కీవాలా. చలిలో బిగుసుకుపోయిన పాదాల్ని బలవంతంగా పైకిలేపి నిల్చున్నాడు అమర్. అతడి చేయి పట్టుకుని లాగుతూ పల్కీవాలా యాత్రికుల గుంపులోకి దూరేశాడు. రెండువైపులా ఉన్న గుడారాల మధ్య దారి గజిబిజిగా సాగుతోంది. గుడారాల్లో ప్రసాదాలూ, ఫోటోలూ అమ్ముతున్నారు. అలసటతో రొప్పుతూ, ''జరా స్లోసే భయ్యా!'' అని పల్కీవాలాని వేడుకున్నాడు అమర్.

గుడారాల్లోంచి బయటపడిన బాట వెడల్పాటి మెట్లదారిగా మారి గుహపై కెగబాకుతోంది. పైకెక్కుతున్న యాత్రీకులు 'భంభం భోలే' అని గొంతులు వుగ్గబట్టి అరుస్తున్నారు. పైకెక్కేకొద్దీ గుహలోపల లింగాకారంలో గడ్డ గట్టినట్టున్న నీలి మేఘం కొద్దికొద్దిగా పెరుగుతూ, చివరకు గుహనంతా ఆక్రమించుకుని విస్మయాన్ని రెట్టింపు చేస్తోంది. మనుషులు చేరువ కాకుండా అడ్డంగా నిలబడిన యినపకమ్ముల కవతల నీలిమంచు దీపంలా నిలబడిన శివలింగం యాత్రికుల్ని విహ్వలపరచసాగింది. మంచు లింగం పైన అతుక్కున్న ఆకుపచ్చ ఆకులు ఆకుపచ్చ వజ్రాల్లా వెలుగుతున్నాయి.

యినప కమ్ముల దగ్గరికి అమర్ శరీరాన్ని తోసి, అతడి పైన యాత్రికులు పడకుండా పిల్లాడిని కాపాడుతున్నట్టుగా చేతులు బారచాచుకుని అడ్డంగా నిలబడి, ''అచ్చా దేఖో సాబ్,'' అన్నాడు పల్కీవాలా.

గుహ ముందు కాలంతో బాటు తమ ఆలోచనలు కూడా గడ్డగట్టుకు పోయి నట్టుగా యాత్రికులందరూ స్తబ్ధంగా నిలబడ్డారు. పల్కీవాలా వెనక్కులాగాకగానీ అమర్ యాంత్రికంగా వెనక్కు కదలలేదు. గుహ ద్వారం దగ్గరికొచ్చాక, గుహలోపలి లింగం కనుమరుగయ్యాక నిర్మోహమాటంగా వెనుదిరిగాడు. సుదూరంగా, గుహకు సమాంతరంగా కనిపిస్తున్న నల్లటి పర్వత శిఖరాల శ్రేణులు అక్కడక్కడా పొడుగ్గా వెడల్పుగా అతుక్కున్న తెల్లటి మంచుతో, పురివిప్పిన పాముల పడగల్లా విశ్రాంతిని కలిగిస్తున్నాయి. మనస్సు, గుండె ఆగిపోయినట్టుగా అతడక్కడ కళ్లార్పడం సైతం మరచిపోయి నిలబడిపోయాడు. నిన్న రేపూ మాయమైపోయినట్టుగా, నేడు శూన్యమై పోయినట్టుగా, ఖాళీ అయిపోయిన మాధ్యమంలా అమర్ నిలబడిపోయాడు.

అతడి చేయి పట్టుకుని లాగి, ''వహా వూపర్ దేఖో సాబ్... దో కబూతర్ హైనా...'' అన్నాడు పల్కీవాలా. గుహ కప్పుకేసి తిరిగాడు అమర్. పైన రాళ్ల నెర్రలిచ్చిన చోట రెండు పావురాలు రెక్కలల్లారుస్తున్నాయి.

పల్కీవాలా అతడ్ని వెనక్కు లాగుతూ చకచకా మెట్లు దిగసాగాడు. యెదురుగా వో పల్కీవాలా వో నడివయసు యాత్రికురాలి చేయి పట్టుకుని గుహపైకి లాక్కెళు తున్నాడు. గత జన్మలో మరచిపోయిన సంగతేదో జ్ఞాపకం వచ్చినట్టుగా, ''నా భార్య... నా వైఫు... భార్గవీ...'' అని అరిచాడు అమర్. అతడి అరుపులు యాత్రికుల సందడిలో కొట్టుకుపోయాయి.

పల్కీవాలా వో గుడారంలోకి లాక్కెళ్లి, ''యే దక్షిణ్ కా భండార్ సాబ్... తుమ్ కుచ్ కావో!'' అన్నాడు.

భండార్‌లో వో చివర గ్యాస్ స్టవ్ పైన వంటలు ఉడుకుతున్నాయి. పెనంలో పూరీలు వేగుతున్నాయి. ఫలహారాల్ని కార్యకర్తలు యాత్రికులకు పళ్లాల్లో వడ్డిస్తున్నారు.

రెండు పూరీల్ని అమర్ పళ్లెంలో వడ్డించిన కార్యకర్త అతడ్ని యెగాదిగా చూసి, "చెన్నయి..." అని వాకబు చేశాడు.

అమర్ తల అడ్డంగా వూపుతూ, "కాదు తిరుపతి," అన్నాడు.

అతను నవ్వుతూ "మాది రేణిగుంట," అన్నాడు.

తెలుగుమాట వినబడగానే ఆనందంగా... ప్రాణం లేచి వచ్చినట్టుగా నవ్వుతూ, "మీరిక్కడికెప్పుడొచ్చారు?" అని అడిగాడు అమర్.

"వారమైపోయింది. సమత్సరమూ వస్తావుండాను. యిది పద్దైదో సమత్సరం. యిది సిద్దిపేటోళ్లు పెట్టిన భండారు. గుహ మూసేదాకా యిక్కడ్నే వుండి యాత్రికులకు సేవజేస్తాను," అన్నాడు.

"మేము నలభైమందిదాకా ట్యూరొచ్చినాము. అందర్నీ వొకే గుంపుగా తొడుక్కోని పోవాలని పల్కీవాళ్లతో ఒప్పందం. అయితే వీళ్లు మాటపైన నిలబళ్లేదు. మావోళ్లంతా యెక్కడెక్కడ్నో అయిపోయినారు," అని అంగలార్చాక, "నా వైపు గూడా..." అంటూ అమర్ గుక్కిళ్లు మింగాడు.

పూరీలు తినేశాక యెంగిలి పళ్లాన్ని గంపలోకి విసిరేయబోయాడతను. కార్యకర్త సరాసరి అక్కడికొచ్చి, అతడి చేతినలాగే పట్టుకుని, "అంత కర్రీ పారేస్తున్నారెందుకు? ఇది ప్రసాదం, మీరు పారేసే ఆహారం, ఇద్దరు భక్తులకు సరిపోతుంది. పళ్లాల్లో వడ్డించు కున్నాక పారేసేది పాపం. తినెయ్యండి," అని కోప్పడుతూ వురిమి చూశాడు,

"గొంతు దిగడంలేదు. యీ నూనేదో పడలేదు," అని గొణిగాడు అమర్.

"వెజిటబుల్స్ ఇంతదూరం రావాలంటే యెంత కష్టపడాల్నో తెలుసునా? అన్నం పరబ్రహ్మస్వరూపం," అతను పట్టు వదల్లేదు.

గత్యంతరం లేకపోవడంతో అమర్ కూరగాయలు వేపుడును బలవంతంగా మింగసాగాడు. కార్యకర్త దృష్టి మర్లడం చూడగానే పళ్లాన్ని గంపలో పడేసి, గుడారం బయటికి దూసుకొచ్చేశాడు. ఇంతలో తన చేయి పట్టుకున్న విరాన్ పల్కీవాలాకేసి బిక్కు బిక్కుమంటూ చూశాడు. మాసిన గడ్డాలతో, దుమ్ముగొట్టుకుపోయిన బట్టలతో పల్కీవాలాలందరూ కాందిశీకుల్లాగే కనబడుతున్నారు. దేశంకాని దేశంలో తనను పలకరించిన తన వూరి వ్యక్తి అలా కసురుకోడం గుర్తొచ్చి విస్తుపోసాగాడు అమర్.

గుడారాలు దాటి మంచు మైదానంలోకి రాగానే పల్లకీ వచ్చి ముందు వాలింది, అమర్ కూచోగానే పల్లకీ పైకి లేచింది, పల్లకీవాలాలు నలుగురు కలిసి వొకే గుర్రపు నాలుగుకాళ్లుగా మారినట్లుగా వాహనం ఉరకలెత్తసాగింది. కొందరు మనుషుల్ని మమ కారాల కతీతంగా మార్చేదీ, మరికొందరు మనుషుల్ని జంతువులుగా మార్చేదీ అయిన మంత్రమేదో ఆ లోయ నావరించినట్టుగా తోచడంతో అమర్ కంగారుపడసాగాడు.

"దర్శన్ కైసా హై సాబ్," అంటూ వో పల్కీవాలా పలకరిస్తున్నాడు. తన వూరి వాడైన వ్యక్తిలో దురుసుతనమూ, కాశ్మీరు పల్కీవాలాలో స్నేహమూ తొంగిచూడడంతో అమర్ అయోమయంలో మునిగిపోయాడు. యెవరు మనుషులవుతున్నారో, యెవరు జంతువులవుతున్నారో తేల్చుకోలేకపోవడంతో విస్మయంలో మునిగిపోసాగాడు. ఇంతలో గుంపులో తప్పిపోయిన భార్య గుర్తుకు రావడంతో అతని మనస్సంతా వికలమైపోసాగింది. ప్రతిభ అవసరాన్ని ఆమెకు చెప్పడమసలు సాధ్యంగాదేమోనని పించగానే అమర్ మరింతగా నివ్వెరపోసాగాడు.

పల్లకీ కుర్చీని వెనక్కు తిరిగేలా యెత్తుకుని పల్కీవాలాలు కదలడంతో అమర్ దూరమవుతున్న గుహకేసి కళ్లార్పకుండా చూస్తూ కూర్చున్నాడు. ఆకాశమంత యెత్తున్న పర్వతమూ, పర్వతమంత పెద్దగా ఉన్న గుహ, గుహకెదురుగా తెల్ల మంచుతురాయిల నలంకరించుకున్న పర్వత శిఖరాల శ్రేణీ, పర్వత శ్రేణుల మధ్య చిగులుకున్న నీలి ఆకాశపు శకలమూ, నీలి ఆకాశం కింద మంచు మైదానానికెదురుగా గుహా, గుహ చుట్టూ తేనెతుట్టె చుట్టూ తిరుగుతున్న తేనెటీగల్లా మూగిన మనుషులూ, మనుషుల్ని అయస్కాంతాల్లా ఆకర్షిస్తున్న రంగుల గుడారాలూ, గుడారాల కవతల మోరలెత్తి చూస్తున్న గుర్రాలూ, గుర్రాల మందకవతల నేల పైన సేద తీరుతున్న ఖాళీ పల్లకీలూ... ఆ దృశ్యం క్రమంగా దూరమవుతూ అమర్ మనస్సును నిశ్శబ్దంతో నింపసాగింది. ఆ నిశ్శబ్దంలోకి అతడి భార్యను గురించిన గుబులు ఖాళీలాంతరు చిమ్నీలోకి దూరి యీగలా రెండుసార్లు తిరిగి వెళ్లిపోయింది.

గుహను సందర్శించుకున్న యాత్రికులు కొందరు వెనుదిరగడంతో బాట పైన ప్రయాణాలు రెండువైపులా సాగుతున్నాయి. దూరంగా పర్వతాలపైన ఆకాశంలో హెలీకాప్టర్ యెగురుతోంది. హెలీపాడ్ దగ్గరి గుర్రాలమంద నలుపు యెరుపూ రంగుల మేఘమేదో వాలిన భ్రాంతిని కలిగిస్తోంది. అక్కడి బాటపైన వరసగా వెళ్తున్న గుర్రాల మంద చీమలబారులా కనబడుతోంది.

మిట్టమధ్యాహ్నం దాటినా లోయ లోపల యెండ లేతగానే ఉంది. బాట పైన ముసలి సన్యాసి రెండు భుజాలూ పట్టుకుని ఇద్దరు సిపాయిలు ముందుకు నడిపించుకెళ్తున్నారు. బాటపక్కన సిపాయిలు గస్తీ తిరుగుతూనే ఉన్నారు. పల్లకీ పాదాల వెనక్కి పరుగెడుతున్న దారి, కొన్నిగంటల క్రితం తాను వెళ్లిన దారేనని నమ్మ బుద్ధి గావడం లేదు. పర్వతాలూ, లోయలూ, రాళ్లూ, హిమపాతాలూ, సెలయేళ్లూ, జలపాతాలూ, అన్నీ యెప్పటికప్పుడు కొత్తగానే కనబడుతున్నాయి. వీచే ప్రతిగాలీ, సోకే ప్రతి ఎండా పర్వతాల్ని సరికొత్తగా ముస్తాబు చేస్తున్నాయి.

వెనకొస్తున్న పల్కీలో భారీ శరీరమున్న స్త్రీ కూచున్నట్టుంది ఆరుమడి పల్కీ వాలాలు మోస్తున్నారు. తిరుగు ప్రయాణంలో దారి మునుపటి కన్నా పెరుగుతున్నట్టు

కాస్సేపూ, తగ్గుతున్నట్టు కాస్సేపూ యేమారిస్తోంది. కొన్ని జలపాతాలూ, కొండ చరియలూ వెళ్తున్నప్పుడు తనకెందుకు కనబడలేదో అర్థంగావడం లేదు. పల్లకీ బరువుగానూ, కాలం త్వరగానూ ప్రయాణం చేస్తున్నట్లున్నాయి.

పల్లకీ నేల పైకి వాలినప్పుడు అమర్ వెనుదిరిగి చూసి, కాలా కాళీ దగ్గరికొచ్చినట్టుగా తెలుసుకున్నారు. దారిలో లోతైన లోయలోకి దిగి, అక్కడ నుంచీ అటువైపు పర్వతంపైకెగబాకుతోంది. మనుషులను దించేసిన గుర్రాల ముకుదాళ్లు పట్టుకుని గోదావాలాలు అదొక లకువుగా గెంతుతూ దిగుతున్నారు. బండరాళ్ల పైన ఇంకా తడిగాగులున్నాయి. ఖాళీ పల్లకీని ఇద్దరు పల్కీవాలాలు మోసుకెళ్తున్నారు. బిరుసు గడ్డాలతో దళసరి ఉన్ని శాలువాలతో పల్కీవాలాలు గొంగళి పురుగుల్ని గుర్తు చేస్తున్నారు. గ్లవుసులూ, మంకీ టోపీలూ, స్వెట్టర్లూ తొడుక్కున్న యాత్రికులు గ్రహాంతరవాసుల్లాగున్నారు. వొళ్లంతా బూడిద రాసుకుని, శూలాలు మోస్తున్న సన్యాసులిద్దరు నిరాసక్తంగా నడుస్తున్నారు.

లోయలోకి దిగాక, మలుపు తిరిగిన బాటలో, కొండ చరియను పట్టుకుని జాగ్రత్తగా పైకెక్కసాగాడు అమర్. తల పైకెత్తి చూస్తే ఆకాశాన్నంటుతున్న కొండ పేటు పైన నల్లటి కాళిక ఆకారం కనబడుతోంది.

లోయలోంచీ పైకెక్కుతున్నకొద్దీ గస తన్నుకు రాసాగింది. అడుగుతీసి అడుగేయడం కష్టమైపోతోంది. యాత్రికులందరూ రొప్పుతూనే నడుస్తున్నారు. ముందుకు కదలమని కాళ్లు మొరాయించడంతో అమర్ వో చోట నిలబడిపోయాడు.

బాగా వంగిన వీపున్న పల్కీవాలా వొకడు, "టైర్ గయా సాబ్... హమ్ లేకర్ జాతే ఆవ్..." అని అతడి భుజాన్ని పట్టుకుని ముందుకు లాగాడు. అమర్ అతని పైకి నిస్సహాయంగా వాలిపోయాడు. మరో పల్కీవాలా గూడా వచ్చి అతడి యెడమ భుజాన్ని పట్టుకున్నారు. అమర్ కళ్లు మూతలు పడసాగాయి. "హోగయా సాబ్... అవుర్ దో కదమ్... బస్... వోయిసా చలో," అని హుషారు చేస్తూ పల్కీవాలాలు అతడ్ని మోస్తున్నట్టుగా నడిపించసాగారు. అమర్ కళ్లు బైర్లు కమ్మాయి. అతడు పెద్ద మూటలా పల్కీవాలాల పైన సోలిపోయాడు.

చాలాసేపటి తర్వాత లీలగా స్మారకమొచ్చేసరికి అమరకు తానో గుడారంలో ఉన్నట్లూ, తన ముఖానికేదో తగిలించినట్టూ తెలిసివచ్చింది. శక్తినంతా వుగ్గబట్టుకుని కదలబోయాడు.

"వెయిట్ ఫర్ ఫ్యూ మోర్ మినిట్స్... యువార్ ఆలరైట్ నవ్..." అంటున్నాడో వ్యక్తి. మరోవ్యక్తి కప్పుతో వేడి ద్రవమేదో తాగించాడు. అరగంట తర్వాత అమర్ బలహీనంగా నవ్వుతూ పైకి లేవడానికి ప్రయత్నించాడు. పక్కమంచం పైన ముఖానికి ఆక్సిజన్ మాస్క్ తొడుక్కున్న స్త్రీ పడుకుని ఉంది. పల్కీవాలా వొకడు గుడారంలో

కొచ్చాడు. యువ డాక్టర్ ఎందుకో కోపంగా అరిచాడు. పల్కీవాలా తలవంచుకుని తిరిగి వెళ్లిపోయాడు,

అతడలా వెళ్లిపోయాక పెద్ద డాక్టరు యువ డాక్టరుతో ఇక్కడ వొళ్లు దగ్గర పెట్టుకుని జాగ్రత్తగా పని చేయాలంటూ మందలించాడు. యిప్పుడు తానేం చేశా నంటూ యువ డాక్టరు రెట్టించాడు. పల్కీవాలాల్లో కొందరు ముజాహిద్ తీవ్రవాదు లుంటారనీ, వాళ్లు అడ్డుకోమని హామీ ఇచ్చాకే అమర్‌నాథ్ యాత్రికులకు కాశ్మీరు గవర్నమెంటు పచ్చజెండా చూపెట్టిందనీ పెద్ద డాక్టరు గుర్తు చేశారు. అమర్ వులిక్కిపడి కళ్లు తెరిచాడు. అంత తీవ్రంగా ఉద్యమం చేసేవాళ్లు ఇలా పల్కీలు మోసే పనేందుకు చేస్తారని యువ డాక్టరు అడిగాడు.

''బయటి నుంచి వచ్చే ఫండింగు యెంతకాలముంటుంది? తీవ్రవాదంతో వూర్లకు వూర్లు యెంతకాలమని గోలపడతాయి? ఆవేశకావేశాలతో కడుపులు నిండు తాయా? యెందుకు గొడవ చేస్తున్నామో యెందరికీ సరిగ్గా అర్థమయింది? యేది మంచో యేది చెడో యెందరికీ తెలుసు... కానీ యిది మాత్రం నిజం...'' అంటూ పెద్ద డాక్టరు కడుపు పైన చేయి పెట్టి చూపించాడు,

యాత్రికులను తీసుకొస్తున్న పల్కీవాలాల వివరాలు రికార్డు పుస్తకాల్లో కెక్కిస్తు న్నందువల్ల, తీవ్రవాదుల్ని పట్టుకోవడం... యువ డాక్టరు బింకంగా వాదించాడు.

పెద్ద డాక్టరు మరోసారి వేదాంతిలా నవ్వి పల్కీవాలాల్లో కలగలిసిపోయే తీవ్రవాదులు ఇతరుల ఐడెంటిటీ కార్డులతో పనిలోకి దిగుతారనీ, అందువల్ల వాళ్లని పట్టుకోవడమంత సులభంగాదని తేల్చేశాడు.

పల్కీవాలా వొకడు గుడారంలోకి తొంగి చూడగానే పెద్ద డాక్టరు, ''అబ్ తుమ్హారా యాత్రీ అచ్ఛా హోగయా! తుమ్ లేసక్ తే...'' అన్నాడు.

పల్కీవాలా అమర్ చేయి పట్టుకుని మంచం దించాడు. ఇతను గూడా ముజా హిద్ తీవ్రవాదేమో, యెవరికీ తెలుసు? అమర్ భయంతో వణకసాగాడు. తీవ్రవాదులు గూడా యిలా మామూలు మనుషుల్లాగే ఉంటారా? బెదిరించి తన దగ్గరున్న డబ్బు లంతా వాళ్లెందుకు లాక్కోలేదు? పల్కీవాలాల్లో అందరూ తీవ్రవాదులు గాకపోవచ్చు. కానీ యెవరు తీవ్రవాదులో, యెవరుగాదో యెలా తెలుస్తుంది? అమర్‌కు ప్రపంచ మంతా గందరగోళంగా కనిపించసాగింది.

అమర్ కూచోగానే పల్లకీ పైకి లేచింది. పర్వతం పైకెగబాకుతున్న బాటకేసీ, పల్లకీ మోస్తున్న పల్కీవాలాలకేసీ అమర్ బెదురుచూపుల్ని సారించసాగాడు. తగులొచ్చి నప్పుడు దుముకుతూ, యెత్తులోకి రొప్పుతూ యెక్కుతూ పల్లకీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. పర్వతపాదాల్లో దాక్కున్న సెలయేళ్లు, ఆకాశపు అంచుల్లో మబ్బుల్లో నక్కిన శిఖరాలూ రహస్య జీవితం గడుపుతున్నట్టున్నాయి. పైనాకిందా పర్వతపు

నడుమును చుట్టుకున్న బాట దాన్ని చిలుకుతున్న తాడులా కనబడుతోంది. గోదావాలాలు ''పల్కీవాలా, రస్తాదే!'' అని కసురుతూ పారిపోతున్నారు, పల్కీవాలాలు పర్వతపు సోలునానుకుని నక్కుతున్నారు. గుర్రాల గుంపొకటి కదను తొక్కుతోంది. బాటపైన్నుంచీ జారిపోతానని భయపెడుతోంది. లోయలోపలి అగాధం బెదిరిస్తోంది. పల్లకీని మోస్తున్న పల్కీవాలాలు రొప్పుతూంటే రహస్య సంకేతాలందించుకుంటున్నట్లే ఉంది.

మరో రెండు పర్వతాల్ని దాటాక పల్లకీ రెండు బాటల కూడలి దగ్గర ఆగింది. అక్కడ చాలా పల్లకీలు సేదదీరుతున్నాయి.

''యహా చాయ్ పీనా సాబ్... హమ్‌కో చాయ్ పిలావో...'' అన్నాడో పల్కీవాలా. అలసటగా వగరస్తూ. అమర్ రెండునోట్లు పైకి తీసి, తర్వాత వాటికి మరో రెండు నోట్లు కలిపారు.

''తుమ్‌కో హమారా మేహనత్ సమజ్ హోగయా సాబ్!'' అని మెచ్చుకుంటూ పల్కీవాలాలు టీ గుడారంకేసి తిరిగారు..

గుడారం ముందు పల్కీవాలాలు గొంతుక్కూచుని చాయ్ చప్పరిస్తున్నారు. వొకరిద్దరు బీడీలు కాల్చుకుంటున్నారు. యింత ప్రశాంతమైన మనుషుల్లో తీవ్రవాదులెలా ఉంటారని అమర్ సందేహించాడు. పొడవాటి గడ్డాలతో, నిడుపాటి తలపాగాలతో అందరూ ముస్లిములేననిపిస్తున్నారు.

అమర్‌నాథ్ గుహను ముందుగా కనిపెట్టిన పశువుల కాపరి కూడా ముస్లిమేననీ, ఇప్పుడుగూడా ఆలయ సంపాదనలో కొంతభాగం ఆ ముస్లిం వారసులకే వెళ్తోందనీ అమర్‌కు జ్ఞాపకం వచ్చింది. యాత్రికులంతా ఇలా గుహకు మోసుకెళుతున్న పల్కీవాలాలు ముస్లిములే అయినా, అమరనాథుడికీ ఆత్మీయులే అవుతారని అతడికనిపించింది. అందమైన కాశ్మీరులోయ వాళ్లందరిలోనూ ప్రతిఫలిస్తున్నట్టుగా తోచడంతో అతను కాస్సేపు ముగ్ధుడైపోయాడు. ఇంతలో తీవ్రవాదులు గుర్తుకు రావడంతో కంగారుపడసాగాడు.

టీలు తాగాక పల్కీవాలాలు పల్కినెత్తుకున్నారు. యెవరో తరుముతున్నట్టుగా పరుగులు తీయసాగారు. దూరాన్ని కొలిచే మైలురాళ్లలా సిపాయిలు దారి పొడవునా గస్తీ తిరుగుతున్నారు. వెదురు కర్రని మోసుకెళ్తున్న పల్కీవాలా 'పల్కీ హోనా...' అంటూ యెదురైన యాత్రికుల్ని అడుగుతున్నాడు. ఖాళీ కుర్చీలను మోసుకెళ్తున్న పల్కీవాలాలు గుర్రాలకంటే వేగంగా పరిగెత్తుతున్నారు.

ఆకాశం మళ్లీ ముసురేసింది. పర్వతాల మధ్య హెలీకాప్టరు మిడతలా యెగురుతోంది. పరుగులు తీస్తున్న పల్కీవాలాలను చూస్తూ వాళ్లకెంత డబ్బులిచ్చినా తక్కువేననుకోసాగాడు అమర్.

పల్లకీ పర్వతపు మలుపు తిరిగేసరికి పలచగా చీకటిగూడా వచ్చేసింది. చెకింగ్ పాయింట్ దాటాక పల్లకినీ కిందికి దించి, పల్కీవాలాలు పక్కనే నేల పైన గొంతు క్కూచున్నారు. వో పల్కీవాలా కుర్చీ దగ్గరికి వొంగి, "అబ్ తుమ్ హమ్ కో బకీష్ దేవ్ సాబ్..." అని అడిగాడు.

అమర్ జేబులోంచి నోట్లు పైకి తీసి చూసి, "యింతే మిగిలుంది. టెంటు దగ్గరికెళ్లాక, యేటీయెమ్‌లో తీసిస్తాను..." అన్నాడు. వాళ్లు అయోమయంగా చూడగానే, గొంతు సర్దుకుని... "తుమ్‌కో బాద్‌మే బడా బక్షీస్ దేతూం..." అన్నాడు.

"కితనా దేతే?" పల్కీవాలా బేరం మొదలెట్టాడు.

"తుమ్హే కితనా హోనా?" అమర్ ప్రసన్నంగా అడిగాడు.

"హజార్..."

"దేతూం..."

"దో హజార్..."

"జరూర్ దేతూం... ఫేరాపాస్ లేజావ్..."

పల్లకీ మళ్లీ ప్రయాణం కొనసాగించింది. బాల్టాల్ గుడారాల దగ్గర సందడి తగ్గలేదు. చుట్టూ కమ్ముకున్న చీకట్ల మధ్య గుడారాల దగ్గరి విద్యుద్దీపాలు నీరసంగా వెలుగుతున్నాయి.

పల్లకీని బాటలో దించాక, పక్కనున్న డేరాకేసి చేయి చాపుతూ, "వో తుమ్హారా డేరా..." అన్నాడో పల్కీవాలా.

అమర్ దిగి నిలబడ్డాడు. అంత దూరమూ నడచి వచ్చినట్లుగా కాళ్లు రెండూ పీకుతున్నాయి. బరువుగా అడుగులేస్తూ తమ డేరాలోకి నడిచాడు. లోపల కొలువు దీరినట్లు ఠీవిగా కూచున్న అణ్ణామలై రెడ్డి కనిపించగానే, "నావైపు... నా భార్యెక్కడ?" అని గీపెట్టాడు.

"నాక్కనబడలేదు... దోవలో వస్తావుంటార్లే సార్," అన్నాడు రెడ్డి తాపీగా.

మంచం పైన కూచుంటూ "ఆమె బరువు తక్కువ గాబట్టి పల్కీవాలాలు త్వరగా దర్శనం జేయించుకొని తెచ్చేస్తారని చెప్పినావు గదా? నాకంటే ముందుగా వచ్చేస్తుండాలి గదా!" అమర్ ఆక్రోశించాడు.

గుడారంలోకొస్తున్న వ్యక్తుల్ని చూసి పలకరింపుగా నవ్వాక, "మనోళ్లంతా వొకరొకరే వస్తావుంటారు... ఆమె కూడా వస్తానే ఉంటుంది.. కొంచెం ముందు యెనకా అంతే!" అన్నాడు రెడ్డి.

"భలే పల్కీవాళ్లను మాట్లాడినావులే రెడ్డీ! వాళ్లు నాస్టాలనీ, టీలనీ నాదగ్గర్నుంచీ యేడు నూర్లు లాగినారు," అన్నాడు లోపలికొచ్చిన వ్యక్తి నిష్టూరంగా.

"నేను వెయ్యి చదివించినాను," మరో వ్యక్తి వాపోయాడు.

"నా వైపు కనబడిందా?" అమర్ ఈసారి లోపలికొస్తున్న వ్యక్తిని అడిగాడు.

అతను లేదన్నట్టుగా తల తిప్పాక, "ఆ పల్కీవాడు యింగా బక్షీష్ గావాలని యెనకాలబడతా వుండాడు. యిప్పటికీ తొమ్మిది నూర్లు ఖర్చు బెట్టించినాడు. యేం చేస్తావో చెప్పు..." అని అణామలై రెడ్డిని నిలదీశాడు.

"బక్షీష్‌తో నాకేం సంబంధం? అది మీ యిష్టం... తెలివిగా తప్పించుకోవాలి. కష్టపడినోళ్లని చెప్పి కొంచెం బక్షీషు యియ్యాల..." అనేశాడు రెడ్డి.

"కొంచెమంటే యెంత? నా దగ్గర్నించీ వెయ్యిదాకా వసూలుజేసినారు," మరో యాత్రికుడు వాపోయాడు.

తానెంత బక్షీషిచ్చానో లెక్కబెట్టసాగాడు అమర్. లెక్క తేలాక తాను తెలివైన వాళ్ల జాబితాలోకి చేరుతాడో లేదో పరీక్షించి చూసుకోసాగాడు.

గుడారంలోకి ఇద్దరు ఆడయాత్రికులు వచ్చారు. 'నా వైపు కనబడిందా?' అని వాళ్లని అడుగుతూనే గుడారం బయటికి పరిగెత్తాడు అమర్. కాస్సేపటి తర్వాత తిరిగొచ్చి, "అన్ని టెంట్లూ వొకే మాదిరుంటాయి. చీకట్లో యెవరెవురో తెలియడం లేదు," అని గింజుకున్నాడు.

గుడారంలోకి వో పల్కీవాలా తొంగిచూసి, "సాబ్, హమారా బక్షీష్," అని అడిగాడు.

"నిన్నే సార్..." అని అమర్‌ను హెచ్చరించాక, "యెంతిచ్చావు నువ్వు?" అని వాకబు చేశాడు రెడ్డి.

అమర్ మనస్సులోనే మరోసారి లెక్కబెట్టి, ముఖం ముడుచుకుని "యియ్యాల్సిన దానికంటే చానానే యిచ్చినాలే!" అన్నాడు.

గుడారంలో మంచం పైన సోలిపోయి ఉన్న మరో యాత్రికుడు, "వాళ్లు పెద్దగా ఆగిత్యం జేసినారు. పర్సు ఖాళీ అయిపోయిందని చూపించేదాకా యిడిసి పెట్టలేదు..." అని నిట్టూర్చాడు.

గుడారంలోకొస్తున్న వాళ్లనంతా వాకబు చేశాక, "ఆ పల్లకీ కంట్రాక్టరునైనా అడగదాం పద రెడ్డీ! లేకపోతే సెక్యూరిటీ వాళ్లనైనా అడగదాం," అని ప్రాధేయపడ్డాడు అమర్.

రెడ్డి అదోలా తలాడించాడు.

"నా వైఫ్‌కు పర్సులో కాష్ పెట్టుకునే వాడుకలేదు. యీ పల్కీవాలాలు టీ షెడ్డులు గనబడినప్పుడంతా దుడ్డిమ్మని మొండిక్కూచుంటారు. వొంటి పైన బంగారం తప్ప యింకేమీ లేదామె దగ్గర. ఆడోళ్లనీమాదిరిగా వాళ్ల బారిన పడేయడం మంచిది గాదని ముందుగా చెప్పినా నీకెక్కలేదు. యెక్కడ తగులుకొని ఇబ్బంది పడతా వుందో! కూరగాయల మార్కెట్టుకు గూడా వొంటిగా పంపించలేదు నేనెప్పుడు," అమర్ బాధతోనూ, భయంతోనూ విలవిలలాడసాగాడు.

అణామలై రెడ్డి విసుగ్గా పైకి లేచి నిల్చున్నాడు. ఎండలో గుడారంలోకొస్తున్న వ్యక్తులు కనబడగానే, "మేడం వస్తా వుండారు... రాండీ మేడం... నా కడుపులో పాలు బోసినారు. మీరింకా రాలేదని మీ హజ్బెండు నా ప్రాణం తీసేస్తా వుండాడు," అని కేరింతలు గొట్టాడు,

భార్గవి లోపలికొచ్చి మంచంపైన టీవిగా కూచుంటూ, "నేనొచ్చి మూడు గంట లయింది. ఆకలిగా వుంటే ఆ తెలుగోళ్ల భండార్ కెళ్లాను. యింకా యెవరూ రాకపోతే అలా భండార్లన్నీ చుట్టుకొచ్చాను," అంది.

"వొంటిగానా? అంతా తిరిగొచ్చావా? ఆ జనంలో దారితప్పి పోయుంటే యేమయ్యేది?" అమర్ కోపంతో గర్జించాడు.

భార్గవి ముఖం చిన్నబోయింది. అంతలోనే ఆవిడ అదోలా తలెగరేస్తూ నవ్వేసి, "దారెలా తప్పుతాను? కావాలంటే యిప్పుడు మళ్లీ యింకో రవుండు తిరిగి రమ్మం టారా?" అని రెట్టించింది.

అణ్ణామలై రెడ్డి కిసుక్కుమని నవ్వేశాడు. అమర్ వురిమి చూడగానే నోటిపైన చేయి పెట్టి మాటలు నొక్కేసుకున్నాడు.

"పల్కీవాలాలకు మీరెంత బక్షీషిచ్చారు మేడం?" గుడారంలోని ఆడ యాత్రికు రాలు భార్గవిని వాకబు చేసింది.

"ఫైవ్ హండ్రెడ్...వాళ్లు ఫోరే చాలన్నారు వాళ్ల కష్టంజూసి నేనే కొంచెం ఎక్కు విచ్చాను... ఆ బండారు దగ్గర వాళ్లల్లో వొకతను కనిపిస్తే నేనే బలవంతంగా పిలిచి మళ్లీ చాయ్ తీసిచ్చాను..." అంది భార్గవి.

గుడారంలోకొచ్చి పల్కీవాలా, "సాబ్, హమారా బక్షీష్..." అని అమర్‌కేసి ఆశగా చూశారు. అతడికి తాను వాళ్లకోసం పెట్టిన ఖర్చంతా గుర్తుకొచ్చింది. అతణ్ణి తినేసేలా వురిమి చూస్తూ, "యింకా బక్షీషా! తుమ్హారా కంట్రాక్టర్‌కో రిపోర్ట్ కర్నా క్యా?" అని కసిరాడు.

"తుమ్ వాదా కర్లియా హైనా! నైతో హమ్ కైకో ఆతే!..." అని గొణుక్కుంటూ పల్కీవాలా వెళ్లిపోయాడు.

అణ్ణామలై రెడ్డి రజాయిల చుట్ట నానుకుని కూచుంటూ, "మీ సారు మీరెక్కడ తగులుకోని యిబ్బందులు పడతా వుండారో అని పెద్దగా యిదయిపోతా వుండారు మేడం! యేడవడం వొకటే తక్కువనుకోండి. యీ కొండల దోవలో మీతో చాలా సంగతులు చెప్పాలని కాపెట్టుకోనుండారంట! దానికాస్కారం దొరకలేదని వుగ్రమొచ్చీ సిందిప్పుడు.. అదేందో యిప్పుడు చెప్పమనండి," అన్నాడు పెద్దగా నవ్వుతూ.

"గుహలో రెండు పావురాలుండాయి... మీకు కనిపించినాయా?" యాత్రికు డొకడు అడిగాడు.

భార్గవి తల వూపి, "మా పల్కీవాలా చూపించినాడు. నేను సరిగ్గా గనబడ లేదంటే, అలాగ నన్ను పైకెత్తి కమ్ముల పైన నిలబెట్టేసినాడు," అంది భార్గవి. అమర్ ముఖం యెర్రగా జేవురించడం చూడగానే, "శివుడు పార్వతికీ అమర్ కథ చెప్పినప్పుడు చుట్టూ యెవరూ లేకుండా కేర్‌ఫుల్‌గా వున్నాడంట! అయితే అక్కడ చర్మంలో యిరుక్కున్న రెండు గుడ్లుండిపోయినాంట. అవి కథ వినేసినాయి. అవి చిరంజీవులై పోయినాయి. ఆ రెండు పావురాలూ అవేనని మా పల్కీవాలా చెప్పినాడు," అని ముక్తాయించింది. అన్నీ కంటికి కనబడుతున్నవే అయినా వాటిలో యేది యెంత నిజమో, కల్పితమో యెవరు చెప్పగలరు. గుడారంలో కొస్తున్న యాత్రికురాల్ని నీడలా వెన్నంటే వస్తున్న పల్కీవాలా, "అవుర్ దో సౌ దేవ్ మాజీ!" అని అడుగుతున్నాడు.

"యిప్పటికే చాలా యిచ్చాను," అని ఆవిడ కస్సుమంటోంది.

"పోనీలే వో వందిచ్చి పంపండి," అంది భార్గవి, అవిడనోసారి కోపంగా చూశాక యాత్రికురాలు వో నోటు పైకి తీసింది.


"లేకర్ జావ్ భయ్యా! యాత్రీకో సతానా బురా కామ్ హైనా!" అని భార్గవి అతడ్ని మందలించింది. అతడు నోటును తీసుకున్నాక భార్గవి కో సలాం సమర్పించి వెళ్లిపోయాడు.

"యెక్కడ పట్టుకోవాల్నో, యిక్కడ యిడిసి పెట్టాలో తెలుసుకుంటేనే గదా సార్ మనిషంటే..." అని అణ్ణామలైరెడ్డి ఆమెను మెచ్చుకోబోయాడు.

అమర్ భార్యకేసి కళ్లార్పకుండా చూడసాగాడు. ఆవిడతో ప్రతిభ ప్రసక్తి తేనందుకు సంతోషపడసాగాడు. యిక ఆ విషయం ఆమెకు చెప్పినా, చెప్పకపోయినా, వొకటేనని వూరట పడసాగాడు.

*విశాలాంధ్ర ఆదివారం*
*9 ఏప్రిల్ 2017*

*




మధురాంతకం నరేంద్ర 16 జులై 1957న జన్మించారు. వీరి మొదటి కథ ***చివరికి దొరికిన జవాబు*** 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. *కుంభమేళా*, *అస్తిత్వానికి అటూ-ఇటూ*, *రెండేళ్ల పధ్నాలుగు* కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. *కథావార్షిక*కు సహసంపాదకులు. *తాత్త్విక కథలు* సంకలనానికి సంపాదకులు. ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్.

***చిరునామా: 15-54/1, శ్రీ పద్మావతీ నగర్, తిరుపతి - 517 502***
***ఫోన్: 98662 43659*** *manarendra@gmail.com*